క్లుప్తంగా

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

అద్దంకి: పట్టణంలోని రాజీవ్‌కాలనీలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య హాజరై దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని పరిసర ప్రాంత భక్తులతోపాటు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు కమిటీవారు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తుల దుకాణాలపై టౌన్ సీఐ రోశయ్య, ఎస్సై సమందర్ వలి దాడులు చేశారు. భవానీ సెంటర్, దర్శి రహదారుల్లో మద్యం విక్రయిస్తున్న ఎస్కే సైదుబాబు వద్ద 20 బాటిళ్లు, పఠాన్ ఆషా వద్ద ఎనిమిది బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సమందర్‌వలి తెలిపారు. దాడుల్లో సిబ్బంది సాగర్, వెంకట్రావు ఉన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

చీరాల రూరల్: కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చునని సీనియర్ సివిల్ జడ్జి ఎం. శుభవాణి అన్నారు. జాతీయ లోక్ అదాలత్ పురస్కరించుకుని శనివారం స్థానిక కోర్టు భవన సముదాయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కోర్టు భవన సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 978 కేసులు పరిష్కరించారు. మూడు బెంచ్‌లుగా ఏర్పాటు చేసిన అదాలత్‌లో మొదటి బెంచ్‌లో ప్రిసైడింగ్ అధికారిణిగా సీనియర్ సివిల్ జడ్జి ఎం. శుభవాణి, రెండవ బెంచ్‌లో ప్రిసైడింగ్ అధికారిణిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహన, మూడవ బెంచ్‌లో ప్రిసైడింగ్ అధికారిణిగా షేక్ నిషాద్ నాజ్‌లు వ్యవహరించారు. బెంచ్ మెంబర్లుగా న్యాయవాదులు కె. రవి, కె. వాసుబాబు, ఎ. రామకృష్ణారెడ్డి, ఎ. సతీష్ రెడ్డి, వినీల, స్నేహలు వ్యవహరించారు. కార్యక్రమంలో కక్షిదారులు, పోలీసులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

చినగంజాం: స్థానిక గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వర దేవస్థానంలో శనివారం నూతన జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పరాశరం రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచన, అగ్నిధ్యానం, ధాతున్యాసం, రత్నన్యాసం, యంత్ర స్థాపన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాన్ని వందల సంఖ్యలో భక్తులు సహాయ సహకారాలతో నిర్వహించారు. వేద మంత్రాల నడుమ వైఖానస పద్ధతిలో శివపార్వతుల కల్యాణం నిర్వహించగా పలువురు దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మహోత్సవంలో శైవ క్షేత్ర పీఠాధిపతులు శివస్వామి పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

చీరాల అర్బన్: చీరాల మండలం బుర్లవారిపాలెం పంచాయతీలోని సాయిబాబా వీవర్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వర, సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం నుండి ప్రారంభమైన కార్యక్రమాలలో భాగంగా శనివారం ప్రతిష్ఠా విగ్రహాలకు పంచగవ్యధివాసము, క్షీరాధివాసము, పంచసూక్త హోమము నిర్వహించారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న కృష్ణచైతన్య



చినగంజాం: ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న శాంతి కల్యాణం



చీరాల: వీవర్స్ కాలనీలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

సీతారాంజనేయస్వామి వారి ఆలయ పునఃప్రతిష్ట

జే.పంగులూరు: మండల పరిధిలోని బూదవాడ గ్రామంలో శనివారం సీతారాంజనేయస్వామి వారి ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవం కన్నుల పండుగగా సాగింది. వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ సీతా సమేతరామస్వామి వార్ల విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠింప జేశారు. ఆలయం ఎదుట ధ్వజస్తంభం ప్రతిష్ఠింపజేశారు. గత రెండు రోజులుగా గ్రామంలో వేద పండితులు మంత్రోచ్చరణ నడుమ, పుణ్యదంపతులచే హోమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, ఏపీ శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య ఆయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు కృష్ణచైతన్యను శాలువాతో సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు వేలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



జరుబులవారిపాలెం వద్ద పొలంబడి నిర్వహిస్తున్న ఏవో, రైతులు

కారంచేడు: యాజమాన్య పద్ధతుల్లో తక్కువ ఖర్చులతో ఎక్కువ దిగుబడులు సొంతం చేసుకోవచ్చని వ్యవసాయాధికారి కే శివనాగప్రసాద్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని జరుబులువారిపాలెం, నాయుడువారిపాలెం ప్రాంతాల్లో జరుగుతున్న పొలంబడి కార్యక్రమాలను పర్యవేక్షించారు. గ్రామాల్లో వీఏఏలు, వీహెచ్ఏలు రైతులకు ఎలాంటి సేవలందిస్తున్నారు, వారికి సాగు పద్ధతులపై ఎలాంటి అవగాహనలు కల్పిస్తున్నారో దగ్గరుండి గమనించారు. ప్రాంతంలో ప్రధాన సాగులైన వరి, శనగ సాగులలో అన్నదాతలు తీసుకోవాల్సిన సాగు పద్ధలపై ఆయన రైతులకు, సిబ్బందికి అవగాహనలు కల్పించారు. శనగ సాగులో తప్పనిసరిగా బోర్డర్ క్రాప్ పద్ధతులను అవలంబించాలన్నారు. గట్టు మీద వేరే పంట ఉడటం వలన రైతుకు మేలు జరుగుతుందన్నారు. శనగలో ప్రస్తుతం కనిపిస్తున్న కుంకుమ తెగులు, అగ్గితెగులు నివారణకు కొద్దిపాటి జాగ్రత్తలతో నివారించుకోవచ్చన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని పమిడిపాడు గ్రామానికి చెందిన పాలపర్తి వినోద్ జ్ఞాపకార్థం వీఐపీ మెమొరియల్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో ఒంగోలు కిమ్స్ వైద్యశాల వైద్యులు పాల్గొని రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీఐపీ మెమొరియల్ సభ్యులు మాట్లాడుతూ పాలపర్తి వినోద్ ఎంతో సేవాభావం గల వ్యక్తి అని, ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. శిబిరంలో పరీక్షలు నిర్వహించుకున్నవారికి ఆసుపత్రిలో నిర్వహించే వైద్య పరీక్షలకు 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిబిరాన్ని సర్పంచ్ పాలపర్తి అంజలీ శ్రీధర్ ప్రారంభించారు.

ఇబ్బందులు తలెత్తకుండా తిరునాళ్ల

చినగంజాం: శివరాత్రి పండుగ సందర్భంగా నిర్వహించే తిరునాళ్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించుకోవాలని ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ సూచించారు. శనివారం మహాశివరాత్రి పురస్కరించుకొని మండలంలోని సోపిరాల రామకోటేశ్వరాలయం, కొత్తపాలెం బాలకోటేశ్వర స్వామి ఆలయం తిరునాళ్ల సందర్భాన్ని పురస్కరించుకొని ఆలయాలను సందర్శించి ఆలయ సిబ్బందితో సమావేశం అయ్యారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ పాయింట్లను సందర్శించి పోలీసు సిబ్బందికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై కట్టా అనూక్, పోలీస్ సిబ్బంది, తిరునాళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.



తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇంకొల్లు సీఐ సూర్యనారాయణ, ఎస్సై అనూక్

ఆర్టీసీ బస్సు- ఆటోఢీ, ముగ్గురికి గాయాలు

చీరాల అర్బన్: ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈప్రమాదం శనివారం చీరాల-కారంచేడు రోడ్డులోని ఫ్రైడ్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద చోటుచేసుకుంది. బాపట్ల జిల్లా వేమూరు మండలం చదలవాడకు చెందిన బడుగు రోశయ్య, బడుగు వెంకటేశ్వర్లు, సుధాకర్ మరికొంతమంది చీరాల రైల్వేస్టేషన్ నుంచి ఆటోలో కారంచేడులో కూలి పనులకు వెళ్తున్నారు. ఫ్రైడ్ స్కూల్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలోని ముగ్గురితో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. జయంతిపేటకు చెందిన ఆటో డ్రైవర్ విల్సన్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుల వద్ద నుంచి ఔట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు. వీరిలో బడుగు వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరుకు తరలించారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

జాతీయస్థాయిలో రాణించి పేరు తీసుకురావాలి

చీరాల: జాతీయ స్థాయిలో రాణించి చీరాలకు, బాపట్ల జిల్లాకు మంచి గుర్తింపు వచ్చే విధంగా క్రీడాకారులు కృషి చేయాలని బాపట్ల జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ తాడివలస దేవరాజు అన్నారు. పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్, స్ట్రాంగ్ ఉమెన్‌గా అవార్డు పొందిన క్రీడాకారిణులను శనివారం ఆయన అభినందించారు. కామాక్షి కేర్ హాస్పిటల్ ఆవరణలో అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ తరుపున డీ.అపర్ణ జేఎన్టీయూ కాకినాడలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్, స్ట్రాంగ్ ఉమెన్‌గా అవార్డు పొందిందన్నారు. ఎస్.ద్వారక ఏఎన్‌యూ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 76 కేజీల విభాగంగా గోల్డ్ మెడల్ సాధించి ఓవరాల్ స్ట్రాంగ్ ఉమెన్‌గా టైటిల్ గెలుపొందిందన్నారు. ఎస్. లక్ష్మి, టి.వేదశ్రీలు జగ్గయ్యపేటలో స్కూల్ గేమ్స్‌లో వివిధ విభాగాల్లో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారన్నారు. నలుగురిని అసోసియేషన్ తరుపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోచ్ అంబేశ్వర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ కోటా లాగూర్‌రెడ్డి, ఎ.ప్రసాద్, ఎస్.నాగేశ్వరరావు, ఏవై ప్రసాద్‌లు పాల్గొన్నారు.



క్రీడాకారులను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అమర గాయకుడు ఘంటసాల



ఘంటసాల విగ్రహానికి పూలమాల వేస్తున్న అన్నంనేని, నాగేశ్వరరావు

అద్దంకి: అమరగాయకుడు ఘంటసాల అని సాహితీ విశ్లేషకుడు అన్నంనేని వెంకట్రావు అన్నారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ఘంటసాల విగ్రహానికి ఘంటసాల గానభారతి సెక్రటరీ గోగులమూడి శేషగిరిరావు అధ్వర్యంలో పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఇటీవలే ఘంటసాల శతజయంతి ఉత్సవాలు అద్దంకిలో ఘనంగా నిర్వహించున్నామని గుర్తు చేశారు. పాట బతికున్నంత కాలం ఘంటసాల పేరు యావత్ దేశం మరువదని చెప్పారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకున్నా పాటతో సజీవంగా ఉన్నట్లేనని చెప్పారు. కార్యక్రమంలో విద్వాన్ చెన్నుపాటి రామాంజనేయులు, దాసభారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు, ఖాజావలి, శ్రీనివాసరావు, రమేశ్, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

అసంపూర్తి గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

మార్టూరు: జగనన్న లే అవుట్లలో అసంపూర్తి గృహ నిర్మాణాలతో పాటు ఇంకా ప్రారంభం కాని గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ ప్రసాద్ అన్నారు. మండలంలోని వలపర్ల, ఇసుకదరిశి గ్రామాలలోని లేఅవుట్‌లో అధికారులతో పర్యటించి ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రారంభంకాని గృహ నిర్మాణాలకు ద్వాక్రా గ్రూపుల నుంచి మంజూరయ్యే రూ.35 వేలతో బేస్‌మెంట్ నిర్మాణాలు ప్రారంభమయ్యేలా సచివాలయ సిబ్బంది, వీఓఏలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు లే అవుట్లకు సంబంధించిన లబ్ధిదారులతో మాట్లాడి మౌలిక వసతులు తదితర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ అర్జునరావు, డీఈ మురళి, ఏఈ విజయాచంద్, ఎంపీడీవో జీ నితిన్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చినగంజాం: గృహనిర్మాణ లబ్ధిదారులు ఉగాదిలోగా గృహాలను నిర్మించుకోవాలని ఎంపీడీవో డీ విజయలక్ష్మి లబ్ధిదారులను కోరారు. శనివారం ప్రత్యేక గృహనిర్మాణ దినోత్సవం, పారిశుద్ధ్య దినోత్సవం పురస్కరించుకొని ఆమె మండలంలోని పల్లెపాలెం, కొత్తపాలెం పంచాయతీలను సందర్శించారు. ఇందులో భాగంగా ఆమె జగనన్న లే అవుట్లలోని గృహాలను సందర్శించి లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. ఉగాదిలోగా గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ఆమె లబ్ధిదారులను కోరారు. కొత్తపాలెం పంచాయతీలోని చెత్త శుద్ధి కేంద్రాన్ని 10 రోజుల్లో పూర్తి చేయాల్సిందిగా కాంట్రాక్టర్‌కు సూచించారు. పల్లెపాలెం పంచాయతీలో ఉపాధీ హామీ కూలీలతో మాట్లాడి వరద కట్ట పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కే స్వరూపరాణి, హౌసింగ్ ఏఈ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు బాబురావు, నాగేంద్రం, వీఆర్వోలు చెంచుపున్నమ్మ, రాధిక, ఉపాధి హామీ సిబ్బంది, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ పాల్గొన్నారు.



ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

పార్టీ విజయానికి కృషి చేస్తాం



కరణం వెంకటేష్‌తో వైఎస్సార్ సీపీ నాయకులు

చీరాల: చీరాల నియోజకవర్గంలో పార్టీ విజయానికి తామందరం కలిసి పనిచేస్తామని పట్టణంలోని 1వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి శ్రీకాంత్ అన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శ్రీకాంత్‌తో పాటు మరికొందరు నాయకులు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కె.ప్రసాదరావు, ధనేశ్వర కుమార్, శీలం డేవిడ్ రాజు, కె.సామ్యేలు, బాబు, ఎ.ప్రవీణ్, ఎస్.వాసు, శివప్రసాద్, నాని, మాదిగాని గురునాథం, యాతం మేరిబాబు, యాతం సునీల్, వాసిమళ్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆదాలత్‌లో 1290 కేసులు పరిష్కారం

అద్దంకి రూరల్: మండల న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు భవనాల సముదాయంలో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్ ఆదాలత్‌లో 1290 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో బీ. బాబూ నాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. బుజ్జప్ప, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ ప్రియదర్శిని, నూతక్కి లోక్‌దాలత్ బెంచ్ సభ్యులు కె. రామకృష్ణరావు, యం. గృహలక్ష్మీ, పాదర్తి రమేష్, ఎస్‌కె అబ్దుల్ జబ్బార్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

■ ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రిటైర్డు అడిషనల్ ఎస్పీ సుంకర సాయిబాబా అన్నారు. శనివారం మండలంలోని రావినూతల గ్రామంలో ఒంగోలు ఇందిరా ప్రియదర్శిని కళాశాల ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అద్దంకి సీఐ రోశయ్య, సర్పంచ్ చాట్ల విజయవీణ, ఉపసర్పంచ్ రామినేని సుజాత, లా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం



నరేష్



గోపి రాజు

అద్దంకి రూరల్/బల్లికురవ: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా, కన్వీనర్లు, కోకన్వీనర్లను ఎంపిక చేసింది. అద్దంకి మండలంలోని సచివాలయాలకు కన్వీనర్‌గా విప్పర్లవారిపాలెం గ్రామానికి చెందిన ఇస్తర్ల వెంకటరావును కేంద్ర కార్యాలయం ఎంపిక చేసింది. సోషల్ మీడియా కో కన్వీనర్‌లుగా యడమకంటి గోపిరెడ్డి, వైకుంఠ రవితేజ, షేక్ కరిముల్లా, తాటికొండ హరీష్ కుమార్‌లు ఎంపికయ్యారు. ఎంపికకు సహకరించిన రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యకు కృతజ్ఞతలు తెలిపారు.

■ బల్లికురవ మండలంలోని 20 సచివాలయాలకు కన్వీనర్‌గా వెలమవారిపాలేనికి చెందిన టీ. నరేష్‌ను కేంద్ర కార్యాలయం ఎంపిక చేసింది. సోషల్ మీడియా కన్వీనర్‌గా సోమవరప్పాడు గ్రామానికి చెందిన గోపిరాజు యాదవ్, కో-కన్వీర్లుగా టీ. అశ్వనీరెడ్డి, టీ.అంకిరెడ్డి, డీ. అజయ్, కె. స్వామి రాజులకు కేంద్ర కార్యాలయం ఎంపిక చేసింది. ఎంపికకు సహకరించిన కృష్ణచైతన్యకు, మండల కన్వీనర్ చింతల పేరయ్య రుణపడి ఉంటామని చెప్పారు.

చీరాల: వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గానికి సంబంధించి సోషల్ మీడియా కన్వీనర్ యాతం క్రాంతికుమార్, కో-కన్వీనర్లుగా కోలా శివకృష్ణ, నీలం సుందర్ సైమన్, షేక్ మహబూబ్‌లు నియమితులయ్యారు.

క్లుప్తంగా

కల్యాణమస్తు, షాదీ తోఫా జమ

బల్లికురవ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫాలో మండలంలో నలుగురు దరఖాస్తు చేయగా, శుక్రవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ అయినట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ తెలిపారు. 2022 అక్టోబర్ నుంచి డిసెంబర్‌లోపు గ్రామాల్లో పెళ్లిళ్లు చేసుకుని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ భవన నిర్మాణ కార్మిక లబ్ధిదారుల ఖాతాలకు సొమ్ము జమ అయినట్లు చెప్పారు. వీరిలో బల్లికురవకు చెందిన కత్తి శశిరేఖ, నక్కబొక్కలపాడుకు చెందిన బండి అనిత, వైదనకు చెందిన నాగనిపోగు అంజలికి ఒక్కొక్కరికి రూ.1 లక్ష వంతున, కొప్పెరపాడు గ్రామానికి చెందిన మైనారిటీ వధువు ఎమ్‌కే జాస్మిన్‌కు మరో రూ.1 లక్ష ఖాతాలకు జమ అయినట్లు చెప్పారు. వివాహం జరిగిన నెల రోజుల్లో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారంచేడు: మండలంలోని కారంచేడు, స్వర్ణ సబ్ స్టేషన్ల పరిధిలోని 14 గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్‌శాఖ ఏఈ కే పిచ్చియ్య తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 1:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పమిడిపాడులో ఉచిత వైద్య శిబిరం నేడు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని పమిడిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామానికి చెందిన వీవీపీ మెమోరియల్ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఒంగోలు కిమ్స్ వైద్యశాల వైద్యులు పాల్గొని ఎముకలు, కీళ్లు, నరాలు, గుండె, గ్యాస్ట్రిక్ ట్రబుల్ వంటి వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు శిబిరం ఉంటుందని సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధ్యం

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంతిపథం ఏపీఎం బీ.సుబ్బారావు సూచించారు. మండలంలోని బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో శుక్రవారం వీవోఏలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలను రూపొందించిందన్నారు. మండలంలో ఉన్న 1764 పొదుపు గ్రూపుల్లో 18900 మంది పొదుపు మహిళలు ఉన్నారని పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సీసీ, సీవీలు, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహిస్తేనే గుర్తింపు

చీరాల టౌన్: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎంపీడీవో నేతాజీ సూచించారు. శుక్రవారం మండలంలోని దేవాంగపురి, గాంధీనగర్, సాల్మన్‌సెంటర్, కొత్తపాలెం గ్రామ పంచాయతీల్లోని సచివాలయాలను ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యల అర్జీలు, మొబైల్ యాప్ డేటా, సచివాలయ ఉద్యోగుల పనితీరు, రికార్డులు పరిశీలించారు. సచివాలయానికి కేటాయించిన ఉద్యోగుల హాజరు, శాఖల వారీ ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయాల ఉద్యోగులు విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, విధుల్లో అలసత్వం వహించిన చర్యలు తప్పవన్నారు. ఎంపీడీవోతో పాటుగా ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు ఉన్నారు.

శాఖల సమన్వయంతో శింగరకొండ తిరునాళ్ల

● రెండు లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా


మాట్లాడుతున్న ఆర్డీవో సరోజిని

అద్దంకి: అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి శింగరకొండ తిరునాళ్లను విజయవంతం చేయాలని చీరాల ఆర్డీవో సరోజిని అన్నారు. ఆర్డీవో అధ్యక్షతన శింగరకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులతో తిరునాళ్ల సమన్వయ కమిటీ సమావేశం ఆమె శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశం ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, ఈవో సుభద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా వచ్చే మార్చి 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న శింగరకొండ 68వ వార్షిక తిరునాళ్లలో తమ శాఖ ఆధ్వర్యంలో తీసుకోనున్న చర్యలు, ఏర్పాటు చేయనున్న వసతుల గురించి చర్చించారు. దేవదాయ శాఖ తరుపున పిల్లలకు పాలు, దేవస్థానంలో క్యూలైన్ల ఏర్పాటు, శింగరకొండపాలెం గ్రామ పంచాయతీ తరపున రోడ్డుకు ఇరువైపులా బారికేడ్ల ఏర్పాటు, పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాల నిర్వహణ చేయిస్తామని ప్రెసిడెంట్ తిరుపతయ్య తెలిపారు. పోలీసు శాఖ తరుపున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తుతో పాటు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తీసుకునే చర్యల గురించి సీఐ రోశయ్య వివరించారు. క్షేత్రంలో తిరుణాళ్ల రోజుల్లో అంతరాయం లేని నిరంతరాయ విద్యుత్ సరఫరా చేసి, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు చెప్పారు. అదే విధంగా ఆర్టీసీ, ఫైర్, హెల్త్, నరసింహస్వామి దేవస్థానం తరుపున, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు చేపట్టనున్న చర్యలు, ఏర్పాటు చేయనున్న వసతుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ త్వరలో మరో సమన్వయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశానికి అన్ని శాఖలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అన్ని శాఖలు కలసి పనిచేస్తేనే తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడవచ్చన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, పబ్లిక్ హెల్త్ అధికారులు ప్రముఖ పాత్ర వహిస్తేనే విజయవతం చేయగలమని చెప్పారు. సమావేశంలో నరసింహ స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ నర్రావుల కొండలు, ఈవో కోటిరెడ్డి, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఫైర్, ఈవోఆర్డీ, ఆర్ అండ్‌బీ, హెల్త్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలో మందుబాబుల ఆగడాలు

● అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా భైటమంజులూరు పాఠశాల


పాఠశాలకు వెళ్లే రోడ్డులో పడేసిన వ్యర్థాలు

జే.పంగులూరు: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేవి పాఠశాలలు. పాఠశాలలో చదువుతోపాటు క్రమశిక్షణ, నీతి, నిజాయితీ కలిగిన పౌరులుగా తయారవుతారు. అలాంటి పాఠశాలను అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా చేసుకుంటున్నారు మందుబాబులు. మండలంలోని భైటమంజులూరు మండల ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణం వరకు మొత్తం చెత్త, చెదారం, సీసాలు, గ్లాసులతో నిండిపోయింది. పాఠశాలకు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే, దుర్గంధాన్ని భరించలేమని విద్యార్థులు వాపోతున్నారు. ఊర్లో నుంచి చెత్తను తీసుకొని వెళ్లటానికి రెండు రిక్షాలు ఏర్పాటు చేశారు. అయిన పారిశుద్ధ్య కార్మికులు పాఠశాల దారిలోని చెత్తను తీసుకొని వెళ్లడం లేదు.

మందుబాబులకు అడ్డాగా..

రాత్రి సమయాల్లో స్కూలు అవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. తెల్లవారేసరికి మద్యం గ్లాసులు, సీసాలు దర్శనమిస్తున్నాయి. దీంతో పాఠశాల అవరణ మొత్తం కలుషితం అవుతోంది. కొన్నిసార్లు మద్యం సీసాలు పగులగొట్టడం వలన పిల్లలకు గాజు పెంకులు గుచ్చుకొని గాయాల పాలవుతున్నారు. పాఠశాలలో కొత్తగా నిర్మించిన మరుగు దొడ్ల తాళాలు పగులగొట్టి మూత్ర, మల విసర్జన చేసి మందుబాబులు పాడుచేస్తున్నారు. కరెంటు బోర్డులను సైతం పగులగొట్టారు. సమస్యలపై పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చక్రవరం చినఅంజమరాజు, గ్రామపంచాయితీ, గ్రామ సచివాలయం వారికి విజ్ఞప్తి చేసిన ఫలితం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

మండల యూటీఎఫ్ కార్యవర్గం ఎంపిక


షేక్ మస్తాన్‌వలి


ఎస్ ఇమ్మానియేలు

కారంచేడు/చినగంజాం: మండల నూతన యూటీఎఫ్ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. కారంచేడు యూపీ పాఠశాల ఆవరణలో ఎంపిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా బిక్షాలు వ్యవహరించగా ముఖ్య అతిథిగా భవనం శ్రీనివాస రెడ్డి, ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ హాజరయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా యూ భవానీప్రసాద్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జీ రమేష్‌రెడ్డి, పావులూరి శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఏ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలిగా పీ నాగమణి, కోశాధికారిగా ఎం ప్రమీల, కార్యదర్శులు న్నికయ్యారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు భవనం శ్రీనివాసరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో..

చినగంజాం: ఇంకొల్లు మండల మండల శాఖ గౌరవాధ్యక్షుడుగా పీ సత్యనారాయణ, అధ్యక్షుడిగా ఎస్‌కే మస్తాన్ వలి, సహాధ్యక్షుడిగా ఎ శ్రీమన్నారాయణ, సహాధ్యక్షురాలిగా బీ దుర్గ, ప్రధాన కార్యదర్శి ఎస్ ఇమ్మానియేలు, కోశాధికారి ఎం మాధవ, జిల్లా కౌన్సిలర్‌గా కేయం విజయకుమారి, సీహెచ్ శివరామకృష్ణ, కవల నాగేశ్వరరావు, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శిగా యు చెంచయ్య నిర్వహించారు.

మసీదు స్థలం రిజిస్ట్రేషన్


సొసైటీ సభ్యులను సత్కరిస్తున్న ముస్లింలు

చీరాల రూరల్: కొత్తపేటలోని ఐఎల్‌టీడీ కాలనీలోగల బిలాల్ మసీదు స్థలాన్ని ఐఎల్‌టీడీ హౌసింగ్ కన్‌స్ట్రక్షన్ సొసైటీ ప్రతినిధులు గిఫ్ట్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేసి మసీదు పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం సొసైటీ చైర్మన్ తక్కెళ్లపాటి చిన వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కోంద్రు యేహోను, సభ్యులు నలతోటి సుబ్బారావు, పఠాన్ కాలేషా, ఎం. శ్రీనివాసులను మసీదు ఆవరణలో ఘనంగా సత్కరించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ మీరావలి మాట్లాడుతూ గత 25 ఏళ్లగా సొసైటీకి చెందిన 42 సెంట్ల స్థలాన్ని మసీదు ఏర్పాటు చేసుకుని వాడుకుంటున్నామని, ప్రస్తుతం ఆ స్థలం మొత్తం మసీదుకు చెందే విధంగా ప్రతినిధులు పెద్ద మనస్సుతో రిజిస్ట్రేషన్ చేశారని చెప్పారు. అందుకుగాను కమిటీ ప్రతినిధులందరికి మసీదు తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు తక్కెళ్లపాటి చిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మసీదు నిర్వహణకు శాశ్విత ప్రాతినదికన రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వడం దైవ కార్యంతో సమానంగా, మా అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటి ప్రతినిధులు జుబేర్, మోహిద్దీన్, మునాఫ్, మహమూద్, ఎస్కే బద్రి, కోఆప్షన్ సభ్యులు షేక్ హుమయూన్ కబీర్ తదితరులు పాల్గొన్నారు.

ఫాగింగ్ మిషన్లు పంపిణీ


మున్సిపల్ కమిషనర్‌కు సామగ్రి అందిస్తున్న ఐటీసీ అధికారులు

చీరాల: చీరాల మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య విభాగానికి చీరాల ఐటీసీ ఆధ్వర్యంలో శుక్రవారం రెండు ఫాగింగ్ మిషన్లు, పారిశుద్ధ్య కార్మికులకు జాకెట్లు, గ్లౌజులు, ఫ్లోర్ క్లీనింగ్ ఆయిల్ మొత్తం రూ.1.60 లక్షలు విలువ గల సామగ్రిని మున్సిపల్ కమిషనర్ పి.ఐసయ్యకు అందించారు. కార్యక్రమంలో ఐటీసీ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ డి.గీతాశ్రీ., జీఎం ఎస్.శ్యామ్‌సుందర్, పర్సనల్ మేనేజర్ విజయలక్ష్మీ, ఈహెచ్‌ఎస్ మేనేజర్ నారాయణరెడ్డి, ఫైనాన్స్ మేనేజర్ నిరంజన్ పాల్గొన్నారు.

శరవేగంగా అయ్యప్పస్వామి దేవస్థాన పనులు


పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మేదరమెట్ల: కొరిశపాడు మండలపరిధిలోని మేదరమెట్ల పాత గుంటూరు రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి దేవస్థానం నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం పలు దేవతామూర్తుల దేవస్థానాల నిర్మాణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్బీకే సిబ్బంది అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న డీఏవో అబ్దుల్ సత్తార్


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పర్చూరు: రైతు భరోసా కేంద్ర సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని బాపట్ల జిల్లా డీఏఓ అబ్దుల్ సత్తార్ అన్నారు. శుక్రవారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మండల వ్యవసాయ సలహామండలి సమావేశం చైర్మన్ కోట హరిప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథి డీఏవో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను రైతుల ముంగిటకు అందించాలని కోరారు. రబీలో ఈ-క్రాప్ బుకింగ్, ఫార్మర్ ఈ-కేవైసీ చేయించాలని, పీఎం కిసాన్ ఈ-కేవైసీ కూడా చేయించాలని చెప్పారు. ఈ నెలలో నగదు రైతుల ఖాతాలలో జమ చేస్తారని చెప్పారు. పర్చూరు సబ్ డివిజన్‌లోని ఆర్బీకేల్లో ఈ రోజుకు 137 మెట్రిక్ టన్నులు యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. అలాగే ప్రతి మండలానికి 3 కిసాన్ డ్రోన్స్ సబ్సిడీ మీద ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడిఏ మోహనరావు, ఏఓ రామ్మోహనరెడ్డి, ఏపీ సీడ్స్ మేనేజరు సుబ్బయ్య, ఏఓ సమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు

వేటపాలెం: మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు పండించే ధాన్యం కొనుగోలు చేస్తారని మండల వ్యవసాయ అడ్వైజరీ బోర్డు చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు తెలిపారు. మండలం పరిదిలోని రామన్నపేట రైతు భరోసా కేంద్ర పరిధిలో మండల అడ్వైజరీ బోర్డు సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో పంట కాల్వల పూడిక తీతపనులు, రోయ్యల చెరువులు, పీఎం కిసాన్, ఈ కేవైసీ, దాన్యం కొనుగోలు గురించి చర్చించారు. ఏఓ ఐ కాశీవిశ్వనాథ్, వీఏఏలు పాల్గొన్నారు.

మార్టూరు: రైతులు తమ పంటలను నమోదు చేయించుకోవాలని సహాయ వ్యవసాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాలు నిర్వహించారు. స్థానిక మార్టూరు-4 రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ భుక్యాశాంతి భాయి మాట్లాడుతూ పైరు నమోదు చేయించుకోవటం ద్వారా ప్రభుత్వ అందిస్తున్న ఉచిత పంటల బీమా, మద్దతు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో చైర్మన్ పెంటేల సత్యనారాయణ, ఏవో వీ కిరణ్‌కుమార్, ఉద్యాన అధికారి బీ హనుమంతనాయక్ పాల్గొన్నారు.

కారు బోల్తా, ఆరుగురికి గాయాలు


బోల్తా పడిన కారు

మేదరమెట్ల: కారు టైరు పగలడంతో అదుపు తప్పి కారు బోల్తా పడింది. ఈ ఘటన శుక్రవారం కొరిశపాడు జాతీయ రహదారిపై జరిగింది. అందిన సమాచారం మేరకు విజయవాడకు చెందిన కండ్లగుంట జగదీష్‌రెడ్డి తన కుటుంబంతో కావలిలో శుభకార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్నారు. కారు కొరిశపాడు జాతీయ రహదారిపైకి రాగానే కారు ముందు టైరు పగలడంతో అదుపు తప్పిన కారు రోడ్డుపై బోల్తా పడింది. కారులో ఉన్న ఆరుగురికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న మేదరమెట్ల పోలీసులు రోడ్డుకు అడ్డంగా పడిన కారును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గాయపడిన వారిని సమీపంలోని వైద్యశాలకు తరలించారు. మరో ప్రమాదంలో కొరిశపాడు జాతీయరహదారిపై గుంటూరు వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న టిప్పర్ టైరు పేలడంతో అదుపుతప్పి సిమెంటు దిమ్మెలను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

'మనం మరచిన మోటుపల్లి' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అతిథులు

చినగంజాం: 'మనం మరచిన మోటుపల్లి' పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం మండలంలోని మోటుపల్లి గ్రామంలో మోటుపల్లి హెరిటేజ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా సైంటిస్ట్ ఏ సత్యనారాయణ, స్థపతి ఈమని శివనాగిరెడ్డి, జ్యోతి చంద్రమౌళిలు పాల్గొన్నారు.

పాత గుర్తులు ఎన్నటికీ చెరిగిపోవు


పదో తరగతి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అద్దంకి: పాఠశాలలో గడిపిన బాల్యం గుర్తులు ఎన్నటికీ చెరగవని ఎంఈవో కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఏల్చూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు ఏల్చూరి శ్రీనివాసరావు, వేల్పూరి రేణుక, ఏ పూర్ణ, ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం పుచ్చకాయల శ్రీనివాసరావును, తమకు చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించారు. తాము చదువుకునే రోజుల్లో చేసిన అల్లరి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తమ సహచరులతో ముచ్చటించి, తీపి జ్ఞాపకాలతో తిరిగి స్వగ్రామాలకు వెళ్లారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

మార్టూరు: జన్మనిచ్చిన తల్లి, రక్తం పంచుకు పుట్టిన సోదరిపై దారుణంగా దాడికి పాల్పడిన నిందితుడిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు సిద్ధి ఆత్మలింగాచారి డిమాండ్ చేశారు. మండలంలోని ద్రోణాదుల గ్రామంలో నూతక్కి వీరనారాయణ తన తల్లి జయమ్మ, సోదరి పార్వతి సుభాషిణిలపై దాడి చేసిన నేపథ్యంలో శుక్రవారం ఆయన ద్రోణాదులలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి విలేకరులతో మాట్లాడారు. ఆస్తి వివాదాలు ఉంటే పరిష్కరించుకోవాలే కానీ భౌతిక దాడులు చేయటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. చికిత్స పొందుతున్న జయమ్మ ఆపరేషన్‌కు అవసరమైన ఖర్చును నిందితుడు వీరనారాయణ నుంచి ఇప్పించాలని డిమాండ్ చేశారు.

ఉప్పటూరులో పూరిల్లు దగ్ధం



పర్చూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో షేక్ సుల్తాన్‌బీకి చెందిన పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈఘటన ఉప్పుటూరు గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వీఆర్వో సుబ్బారావు వివరాల మేరకు.. ఉప్పుటూరు గ్రామంలోని జెండా చెట్టు వద్ద షేక్ సుల్తాన్‌బీకి చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైందని తెలిపారు. ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిపోయాయని, సుమారు 2.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. తహసీల్దారు నెహ్రూబాబు బాధితురాలికి తక్షణ సాయం కింద రూ.5 వేలు నగదు, 50 కేజీల బియ్యం, 2 కేజీల కందిపప్పు, 2 కేజీల పంచదార అందించినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీలు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎంపీడీవోలు

బల్లికురవ: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు రాజకీయ పార్టీలు, ఓటర్లు సహకరించాలని మండల ఎన్నికల అధికారి బీ సీతారత్నం కోరారు. ఆమె స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై రాజకీయ పార్టీలు గ్రామ పంచాయతీల సెక్రటరీలు, వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. గురువారం నుంచి ఎన్నికల కోడ్ అములోకి వచ్చిందన్నారు. ఈ నెల 16న నోటిఫికేషన్, మార్చి 13న ఎన్నికలు, 16న కౌంటింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు కోడ్ అమలులో ఉందని ప్రారంభాలు శంకుస్థాపనలు, ఓటర్ల ప్రభావితం చేసే సమావేశాలు నిర్వహించరాదని సీతారత్నం వివరించారు. మండలంలో ఇప్పటికే పట్టభద్రులుగా 1117 మంది, ఉపాధ్యాయల ఎమ్మెల్సీకి 30 మంది ఓటు హక్కు పొందారని, వీరు కాకుండా ఆన్‌లైన్‌లో పట్టభద్రులు 80 మంది, ఉపాధ్యాయులు 17 మంది దరఖాస్తులు సమర్పించారని విచారణతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని ఆమె చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, రాజకీయ పార్టీలకు సంబంధించి మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ చింతల పేరయ్య, టీడీపీ నాయకులు గొట్టిపాటి లక్ష్మయ్య పాల్గొన్నారు.

రచయిత డీవీఎంకు పురస్కారం

అద్దంకి: సాహితీవేత్త పద్య, కావ్య రచయిత డీవీఎం సత్యనారాయణకు డాక్టర్ నాగభైరవ స్మాకరక సాహితీ పురస్కారాన్ని ఈ నెల 22న గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లో భూసురపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అందజేయనున్నారు. ఈ మేరకు డీవీఎం సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కమ్ముకున్న మంచు దుప్పటి


కారంచేడు-పర్చూరు రోడ్డులో దట్టంగా ఉన్న మంచు


కారంచేడు- చీరాల రోడ్డులో పొగమంచుతో మూసివేసిన రహదారి

కారంచేడు: గత మూడు రోజుల నుంచి దట్టమైన పొగ మంచు కురుస్తోంది. శుక్రవారం ఉయదం 9 గంటల వరకు కూడా పొగ మంచు కమ్మేసింది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో వ్యవసాయ కూలీలు పనులకు వెళ్లడానికి కొంత ఇబ్బందులు పడ్డారు. ఆటో వాలాలు, ఉదయం ప్రయాణం చేసే వాహనదారులు లైట్ల కాంతిలోనే తమ పనులు, ప్రయాణాలను ప్రారంభించారు. దట్టంగా మంచు కురుస్తుండటంలో శనగ చేలకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెప్తున్నారు.